నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
సోమవారం
09-12-2024
పేజీలు: 02



## రాష్ట్రంలో తెలంగాణ తల్లి తొలి విగ్రహం ఇదే!

తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో యాదాద్రి(D) రాజాపేట(M) బేగంపేటలో తొలిసారిగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఉద్యమ కారుడు సుదగాని వెంకటేశ్ ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని 2007 జనవరి 25న అప్పటి తల్లి తెలంగాణ పార్టీ చీఫ్ విజయశాంతి ఆవిష్కరించారు. ఆ విగ్రహం కిరీటం లేకుండా సాధారణ స్త్రీ రూపంలో ఉండేది. ఆ విగ్రహానికి ప్రస్తుత ప్రభుత్వం ఆవిష్కరించనున్న విగ్రహానికి పోలికలు ఉన్నాయని పలువురు అంటున్నారు.





### అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఇంట్రెస్టింగ్ కామెంట్స్

# తెలంగాణ తల్లి విగ్రహ ప్రత్యేకత అదే..

తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలకు కీలక సూచనలు చేశారు. తెలంగాణ తల్లి విగ్రహంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను గట్టిగా ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి వేరు దేవత వేరు అని, ఏ తల్లికి కిరీటం ఉండదని స్పష్టం చేశారు. దేవతలకు మాత్రమే కిరీటం ఉంటుందన్నారు. ప్రభుత్వం ఆవిష్కరిస్తున్నది తెలంగా ణ తల్లి విగ్రహం మాత్రమేనని, ఇది తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. అలాగే తెలంగాణ గ్రామ దేవత పోచమ్మకు కిరీటం ఉంటుందా? ఈ అంశాన్ని జనాలకు వివరించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సూచించారు.తెలంగాణ తల్లి విగ్రహంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు నిరాధారమని సీఎం రేవంత్ రెడ్డి ఖండించారు. ప్రజల్లో అపోహలు కలిగించే ప్రయత్నాలను గట్టిగా తిప్పికొట్టాలి అని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు గౌరవం చాటడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం చెప్పారు. ప్రజలు ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయాన్ని అర్థం చేసుకుని, ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకోకుండా రాష్ట్ర గౌరవాన్ని కాపాడాలని సీఎం ఎమ్మెల్యేలను కోరారు. ఇక తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించిన చర్చను సీఎం అసెంబ్లీ లో ప్రారంభించారు. తెలంగాణ తల్లి ఎలా ఉంటుందో సభ్యులకు వివరించారు.





### నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను

## అరెస్ట్ చేసిన పోలీసులు

ప్రధాన ప్రతిపక్షం లేకుండానే అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకుని, అరెస్టు చేశారు. అనంతరం కేటీఆర్, కవిత సహా పార్టీ ప్రజాప్రతినిధులను పోలీసు వ్యానుల్లో అక్కడి నుంచి తరలించారు. సోమవారం ఉదయం దీక్షా విజయ్ దివస్ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, అదానీ ఫొటోతో కూడిన టీషర్టులను ధరించి అసెంబ్లీకి బయల్దేరారు. దీంతో అసెంబ్లీ గేటు-2 వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. రేవంత్, అదానీతో కూడిన టీషర్టు ధరించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత నెలకొన్నది. ఈ నేపథ్యంలో పోలీసుల అధికారులను కేటీఆర్ నిలదీశారు. తమను ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలన్నారు. రేవంత్ అదానీ భాయి భాయి అంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన వ్యక్తం చేశారు. ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ, తెలంగాణ తల్లి మాది.. కాంగ్రెస్ తల్లి నీది, బతుకమ్మను తీసి చేయి గుర్తు పెట్టిందంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ క్రమంలో కేటీఆర్, హరీశ్ రావు, కవిత, సబితా ఇంద్రారెడ్డితోపాటు పార్టీ ప్రజాప్రతినిధులు అరెస్టు చేసి పోలీసు వ్యానుల్లో అక్కడి నుంచి తరలించారు.

### అదానీ దొంగ అని రాహుల్ అంటే..

## రేవంతేమో అలాయ్ బలాయ్ చేసుకుంటడు

అదానీ దొంగ అని, అవినీతి చేసిండని రాహుల్ గాంధీ తిడితే, రేవంత్ రెడ్డి ఇక్కడ చీకటి ఒప్పందాలు చేసుకుంటడు.. అలాయ్ బలాయ్ చేసుకుంటడు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. శాసనసభలోకి వెళ్లకుండా ప్రతిపక్ష నాయకులను అడ్డుకొని అరెస్టులు చేయడం పట్ల హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు. అదానీతో వేలకోట్ల రూపాయలు ఒప్పందాలు చేసుకుంటడు. ఇదెక్కడి న్యాయం. వివిధ మార్గాల్లో ప్రతిపక్షాలు నిరసనలు తెలియచేస్తుంటాయి. అడ్డుకోవడం దుర్మార్గం. అక్రమ సంబంధాలు, చీకటి ఒప్పందాలు బయట పడుతాయని ప్రతిపక్షాన్ని సభలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. సభ ఏకపక్షంగా జరిపే ప్రయత్నం చేస్తున్నారు. అదానీతో చీకటి ఒప్పందం బయటపడిందని, మేము ప్రశ్నిస్తామని భయపడుతున్నరు అని హరీశ్‌రావు తెలిపారు. మమ్మల్ని సభలోకి రాకుండా ఎందుకు ఆపుతున్నావు రేవంత్ రెడ్డి? పార్లమెంట్‌లో రాహుల్, ప్రియాంకలు అదానీ, మోడీ బాయి బాయి అనే స్లోగన్స్ తో టీషర్ట్స్ వేసుకున్నరు. మేము ఇక్కడ అదే విధంగా మీ చీకటి ఒప్పందాన్ని ప్రశ్నిస్తే తప్పేంటి..? నువ్వు తప్పు చేసినవు కాబట్టే మేం ప్రశ్నిస్తామని మీరు భయపడుతున్నారని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.





## కేరళలో బీజేపీ కొత్త గేమ్ ప్లాన్!

పదేళ్లలో కేరళలో పాగా వేయడానికి బీజేపీ ఒక స్ట్రాటజీని సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం అక్కడ హిందువులు 54, ముస్లిములు 27, క్రైస్తవులు 18% ఉన్నారు. తమను నిర్లక్ష్యం చేస్తున్నారని ఫీలవుతూ ఎల్‌డీఎఫ్‌ను వీడుతున్న హిందూ, క్రైస్తవులను బీజేపీ చేరదీస్తోంది. క్రైస్తవ మత పెద్దలతో సమావేశమవుతూ మద్దతు సంపాదిస్తోంది. తాజాగా జార్జ్ జాకబ్ కూవకడ్ కార్డినల్ వేడుకకు ఓ బృందాన్ని వాటికన్‌కు పంపించింది.



## మీడియా షేర్లు ఢమాల్

స్టాక్ మార్కెట్లు స్వల్ప నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఆసియా మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు రావడం, వెస్ట్ ఏషియాలో అనిశ్చితే ఇందుకు కారణాలు. నిఫ్టీ 24,641 (-35), సెన్సెక్స్ 81,573 (-140) వద్ద ట్రేడవుతున్నాయి. రియాల్టి, కన్జూమర్ డ్యురబుల్స్ షేర్లకు డిమాండ్ కనిపిస్తోంది. FMCG, మీడియా, ఫార్మా షేర్లపై సెల్లింగ్ ప్రెజర్ నెలకొంది. LT, SBI LIFE, KOTAK BANK, TECH M టాప్ గెయినర్స్.

### హాస్టల్‌లో ఇంటర్ బాలిక ప్రసవం..

## బిడ్డను విసిరేసిన వైనం

ఏలూరులోని ఓ మిషనరీ సంస్థ హాస్టల్‌లో అమానవీయ ఘటన జరిగింది. ఓ ఇంటర్ బాలిక ఆడ బిడ్డను ప్రసవించింది. సహచరులు భయంతో నాలుగో అంతస్తు నుంచి ముళ్ల పొదల్లోకి శిశువును విసిరేయడంతో చనిపోయింది. ఈ దృశ్యాలను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు బాలికను ఆస్పత్రికి తరలించి వివరాలు సేకరిస్తున్నారు. బాలిక గర్భం దాల్చడంలో నిర్వాహకుల ప్రమేయం ఉందా? అని ఆరా తీస్తున్నారు.



### పార్లమెంట్ ఆవరణలో ఇండియా కూటమి ఎంపీల ఆందోళన..


#### తృణమూల్, ఎస్పీ దూరం

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ సమావేశాలను ఆదానీ వ్యవహారం, సంభల్ హింసాకాండ తదితర అంశాలు కుదిపేస్తున్నాయి. ఈ క్రమంలో ఇవాళ సమావేశాలు ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. అదానీ వ్యవహారంపై లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా విపక్ష ఎంపీలంతా నిరసనకు దిగారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అయితే, ఈ నిరసనలకు తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు హాజరుకాలేదు.

### కొచ్చి వెళ్తున్న విమానం చెన్నైలో

## ఎమర్జెన్సీ ల్యాండింగ్

100 మంది ప్రయాణికులతో కేరళలోని కొచ్చి బయల్దేరిన ఓ ప్రైవేట్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో విమానాన్ని చెన్నైలో అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ప్రయాణికులు, సిబ్బంది సహా మొత్తం 117 మందితో ఓ ప్రైవేట్ విమానం ఇవాళ చెన్నై నుంచి కొచ్చి బయల్దేరింది. విమానం టేకాఫ్ అయిన కాసేపటికే సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో అప్రమత్తమైన పైలట్ ముందు జాగ్రత్త చర్యగా విమానాన్ని తిరిగి చెన్నైకి మళ్లించారు.



### టీజర్ తో ఆకట్టుకుంటున్న

## ద గర్ల్ ఫ్రెండ్

రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'ద గర్ల్ ఫ్రెండ్'. ప్రముఖ నటుడు-దర్శకుడు రాహుల్ రవీంద్రన్ తీస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా టీజర్ రిలీజ్ అయింది. ఎమోషనల్ లవ్ స్టోరీగా రాబోతున్న ఈ సినిమా టీజర్ చాల బాగా ఆకట్టుకుంది. పైగా విజయ్ దేవరకొండ వాయిస్ ఓవర్‌తో ఈ టీజర్ సాగడం విశేషం. 'నీకని మనసుని రాసిచ్చేసా.. పడ్డానేమో ప్రేమలో బహుశా' అని విజయ్ దేవరకొండ చెబుతుంటే.. స్క్రీన్‌పై రష్మిక విజువల్స్ చాలా బాగున్నాయి. మొత్తానికి టీజర్ సినిమా పై అంచనాలను మరింతగా పెంచింది. ముఖ్యంగా టీజర్ మొత్తం రష్మిక క్లోజప్ షాట్స్ కనిపించాయి. మొత్తానికి ఈ మూవీలో రష్మిక యాక్టింగ్ అదరగొట్టేయబోతుందనిపిస్తోంది. కాగా 'ద గర్ల్ ఫ్రెండ్' సినిమాని గీతా ఆర్ట్స్ సంస్థ నిర్మిస్తోంది.





## మంచు ఫ్యామిలీ వివాదం.. కీలక పరిణామం

మంచు ఫ్యామిలీలో వివాదం నేపథ్యంలో ఇవాళ కీలక పరిణామం చోటుచేసుకుంది. జల్‌పల్లిలోని మంచు మనోజ్ ఇంటికి అన్న మంచు విష్ణు వ్యాపార భాగస్వామి విజయ్ వెళ్లారు. అక్కడి సీసీ ఫుటేజ్ హార్డ్ డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. మనోజ్ ఇంటి దగ్గర ప్రైవేట్ బౌన్సర్లను కాపలాగా పెట్టారు. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న మంచు విష్ణు కాసేపట్లో తమ్ముడి ఇంటికి వెళ్లనున్నారు. దీంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## 14 ఏళ్ల బాలిక తెగింపు.. ఓ దేశాన్ని కదిలించింది

సిరియా అధ్యక్షుడు, డాక్టర్ బషర్ అల్ అసద్ దేశాన్ని వీడటంతో ఆ దేశం రెబల్స్ వశమైంది. ఈ పోరాటానికి 14 ఏళ్ల బాలిక తెగింపు ఆజ్యం పోసింది. అసద్ అరాచకాలను తట్టుకోలేక 2011లో ఆమె దారా అనే గ్రామంలోని గోడలపై 'ఇక నీ వంతు డాక్టర్' అని గ్రాఫిటీ చిత్రాలు వేసింది. దీంతో ఆ బాలిక, స్నేహితురాళ్లను పోలీసులు 26 రోజులు హింసించారు. ఈ క్రమంలో దారాలో మొదలైన తిరుగుబాటు దేశంలో అంతర్యుద్ధానికి దారితీసి అసద్ పతనంతో ముగిసింది.







## అందుబాటులోకి 'మీ సేవ' మొబైల్ యాప్

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'మీ సేవ' మొబైల్ యాప్‌ను మంత్రి శ్రీధర్ బాబు లాంచ్ చేశారు. ఈ యాప్ ద్వారా ఇంటి నుంచే 150 రకాల సేవలు పొందవచ్చు. కులం, ఆదాయం, జనన ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చు. బిల్లుల చెల్లింపులు చేయవచ్చు. ఈ యాప్‌తో పాటు ఇంటింటికీ ఇంటర్నెట్ అందించే టీ ఫైబర్ నెట్ సేవలనూ ప్రభుత్వం ప్రారంభించింది. తొలుత పైలట్ ప్రాజెక్టుగా పెద్దపల్లి, నారాయణపేట, సంగారెడ్డి జిల్లాల్లో అమలు చేయనుంది.



## ఢిల్లీలోని 40 స్కూల్స్‌కు బాంబు బెదిరింపులు..

దేశ రాజధాని ఢిల్లీలోని పలు స్కూళ్లకు మరోసారి బాంబ్ బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతుంది. ఢిల్లీలోని పశ్చిమ్ విహార్‌లోని డీపీఎస్ ఆర్‌కె పురం, జిడి గోయెంకా పాఠశాల అనే రెండు పాఠశాలలకు సోమవారం ఉదయం ఇమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో స్కూల్‌కు బాంబ్ స్క్వాడ్, పోలీసులు చేరుకున్నారు. దీంతో బాంబ్ స్క్వాడ్ స్కూళ్ళలో తనిఖీలు చేపట్టింది. డీపీఎస్ ఆర్‌కె పురం నుండి ఉదయం 7.06 గంటలకు, జిడి గోయెంకా పశ్చిమ్ విహార్ నుండి ఉదయం 6.15 గంటలకు బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయని ఓ డీఎఫ్ఎస్ అధికారి తెలిపారు . అగ్నిమాపక అధికారులు, డాగ్ స్క్వాడ్, బాంబు డిటెక్షన్ బృందాలు, స్థానిక పోలీసులు పాఠశాలలకు చేరుకుని సోదాలు నిర్వహించారు. ఇప్పటి వరకు అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదని పోలీసులు తెలిపారు.ఢిల్లీ పొరుగు రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో, లక్నోలోని మూడు కీలక ప్రదేశాలకు బాంబు బెదిరింపు బూటకమని తేలింది. గుర్తుతెలియని కాలర్ శనివారం రాత్రి UP పోలీసుల ఇంటిగ్రేటెడ్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ అయిన 112కి డయల్ చేసి, హుస్సేన్‌గంజ్ మెట్రో స్టేషన్, చార్‌బాగ్ రైల్వే స్టేషన్, అలంబాగ్ బస్టాండ్‌లో బాంబులు పెట్టినట్లు పేర్కొన్నాడు. కాల్ వచ్చిన తర్వాత మూడు స్థానాలను క్షుణ్ణంగా తనిఖీ చేశామని అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏడీసీపీ)-సెంట్రల్ మనీష్ సింగ్ తెలిపారు. గత కొద్ది రోజులుగా ప్రముఖ తాజ్ మహల్ సహా పలుచోట్ల బాంబు బెదిరింపులు వచ్చాయి. ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుంటూ ముంబై పోలీసులకు బెదిరింపు సందేశం వచ్చింది.



## నష్టాల్లోనే టాప్ 10 కాయిన్స్

క్రిప్టో కరెన్సీ రారాజు బిట్‌కాయిన్ భారీ నష్టాల్లో ట్రేడవుతోంది. నేడు $1.01 లక్షల వద్ద ఓపెనైన కాయిన్ అదే స్థాయి వద్ద గరిష్ఠాన్ని అందుకుంది. ఇన్వెస్టర్లు, ట్రేడర్లు లాభాల స్వీకరణకు దిగడంతో $99,245 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. ప్రస్తుతం $1663 నష్టంతో $99,452 వద్ద కొనసాగుతోంది. రెండో అతిపెద్ద కాయిన్ ఎథీరియమ్ 1.39% నష్టపోయి $3948 వద్ద కొనసాగుతోంది. టాప్ 10 కాయిన్స్ అన్నీ నష్టాల్లోనే ఉన్నాయి.





## సీక్రెట్ కెమెరాలకు చెక్ పెట్టేందుకు..

మహిళలు సీక్రెట్ కెమెరాల బారిన పడకుండా ఉండేందుకు హైదరాబాద్ పోలీసులు 'యాంటీ రెడ్ ఐ' టీమ్‌ను తీసుకొస్తున్నారు. స్టార్ హోటల్స్, లాడ్జీలు, షాపింగ్ మాల్స్‌లోని ట్రయల్ రూమ్స్, పబ్స్, హాస్టల్స్, హాస్పిటల్స్‌లో ఎక్కడ సీక్రెట్ కెమెరాలున్నా ఈ టీమ్ వాటిని గుర్తిస్తుంది. ఇందుకోసం 2వేల మంది నేషనల్ సర్వీస్ స్కీమ్ విద్యార్థులకు ట్రైనింగ్ ఇచ్చారు. వీరు షీ టీమ్స్‌తో కలిసి బగ్ డిటెక్టర్‌తో తనిఖీలు చేపడతారు.

## హాట్ లుక్‌లో ప్రగ్యా జైస్వాల్

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బాబీ కాంబినేషన్ లో ఓ సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. కాగా ఈ మూవీ కొత్త షెడ్యూల్ ఈ నెలాఖరు నుంచి హైదరాబాద్ లో ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఐతే, బాలయ్యతో పాటు ముఖ్య నటీనటులంతా ఈ షెడ్యూల్ లో పాల్గొంటారట. యాక్షన్ సీక్వెన్స్ తో పాటు ఓ సాంగ్ ను కూడా చిత్రీకరిస్తారని తెలుస్తోంది. ఈ సాంగ్ ను బాలయ్య – ప్రగ్యా జైస్వాల్ కలయికలో తీస్తారట. మొత్తమ్మీద ఈ మూవీ కచ్చితంగా బాలయ్య ఫ్యాన్స్ కి ఫుల్ మీల్స్ ఇచ్చేలా దర్శకుడు బాబీ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారట. ఏది ఏమైనా ఈ సినిమా కోసం బాలయ్య ఫ్యాన్స్ రెట్టింపు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగ వంశీ, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాపై సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమాకి థమన్ సంగీతం అందిస్తున్నారు. కాగా ఈ సినిమాలో బాలయ్య పాత్ర నెవ్వర్ బిఫోర్ తెలుస్తోంది.

## మెక్సికో, కెనడాలు అమెరికాలో విలీనమవడం బెటర్

పొరుగు దేశాలైన మెక్సికో, కెనడాలకు అందిస్తున్న రాయితీలపై అమెరికాకు కాబోయే అధ్యక్షుడు ట్రంప్ మరోసారి స్పందించారు. 'కెనడాకు ఏటా $100B, మెక్సికోకు $300B సబ్సిడీ ఇస్తున్నాం. అసలు ఈ దేశాలకు ఎందుకు ఇవ్వాలి? దాని కంటే ఆ రెండు అమెరికాలో రాష్ట్రాలుగా విలీనమైతే మంచిది' అని వ్యాఖ్యానించారు. అక్రమ వలసదారులను కట్టడి చేయకపోతే ఆ దేశాల దిగుమతులపై భారీ పన్నులు విధిస్తామని ఇటీవల ఆయన హెచ్చరించిన విషయం తెలిసిందే.


## తగ్గిన పుష్ప 2 టికెట్ ధరలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ 'పుష్ప2: ది రూల్'. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం అని తేడా లేకుండా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ సునామీ సృష్టిస్తున్న విషయం తెలిసిందే. కేవలం 3 రోజుల్లో ఈ చిత్రం రూ.600 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా టికెట్ రేట్లకు సంబంధించి మూవీ ప్రేక్షకుల నుంచి నెగిటివ్ వచ్చిన విషయం తెలిసిందే. బెనిఫిట్ షో టికెట్‌నే రూ.1250గా పెట్టిన చిత్రబృందం విడుదలైన తర్వాత టికెట్ రేట్లను సింగిల్ స్క్రీన్‌లో రూ.350గా.. మల్టీప్లెక్స్‌లో రూ.550గా పెట్టింది.దీంతో సాధారణ ప్రేక్షకులు ఈ సినిమాకు చాలా దూరమయ్యారు. ముఖ్యంగా ఒక ఫ్యామిలీ నుంచి నలుగురు ఈ సినిమాకి వెళ్లాలి అంటే సింగిల్ స్క్రీన్‌లో రూ.1380 అవ్వనుండగా.. మల్టీప్లెక్స్‌లో రూ.2120లు కానుంది. దీంతో టికెట్ ధరలు మూవీపై చాలా ఎఫెక్ట్ పడ్డాయి. సోషల్ మీడియాలో అయితే టికెట్ ధరలపై సెటైర్లు , ట్రోలింగ్ ఓ రేంజ్‌లో జరిగింది. ఈ నేపథ్యంలో పుష్ప నిర్మాతలు దిగొచ్చారు.

### యూట్యూబ్‌లో పుష్ప-2 స్ట్రీమింగ్

పుష్ప-2 నిర్మాతలకు మరో షాక్ తగిలింది. మూవీ విడుదలైన రోజే పలు ఆన్‌లైన్ సైట్లలో లీకవగా తాజాగా కొందరు యూట్యూబ్‌లో హిందీ వెర్షన్ లైవ్ స్ట్రీమింగ్ చేస్తున్నారు. ఈ ఘటనలపై మేకర్స్ ఇంకా స్పందించలేదు. త్వరలోనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉందని సమాచారం.

## ఓటీటీలో అదరగొడుతోన్న అమరన్



శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించిన అమరన్ మూవీ నెట్‌ఫ్లిక్స్‌లో అదరగొడుతోంది. ఇండియా, సింగపూర్, శ్రీలంకలో నంబర్-1 స్థానంలో ట్రెండ్ అవుతోంది. మొత్తంగా 14 దేశాల్లో టాప్-10 లిస్టులో కొనసాగుతోంది. మలేషియా, మాల్దీవ్స్, నైజీరియా, యూఏఈలో రెండు, ఖతార్‌లో 3, పాకిస్థాన్‌లో 5, గ్లోబల్‌గా 10వ స్థానంలో స్ట్రీమింగ్ అవుతోంది. అక్టోబర్ 31న విడుదలైన ఈ చిత్రం రూ.320 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించిన విషయం తెలిసిందే.